# ఎదురీత

ఎదురీత...

ఏది యెదురీత?

ప్రవాహమంటూ వుంటే, ఆ వాలు కెదురుగా ఈదితే —అదీ యెదురీత.

వేసవి యెండల కెండి, బీటలువారిన పంటభూమి దాహం తీర్చేందుకు పరుగులెత్తే పంట కాలువకైతే — ఒక వాలుంటుంది.

ఏనాటి అనుబంధవో పట్టుకు పెనవేసుకు, ప్రియాసమ గమానికన్నట్టు సముద్రంవైపుకు పరుగులెత్తే నదికైతే – ఒక వాలు వుంటుంది నిజమే.

కాని, కెరటాల హస్తాలు చాచి, చెలియలికట్టని కౌగలించుకోబోయ్యే సముద్రానికి?

ఉరుకలూ, పరుగులూ, సగుగులే దప్ప వాలంటూ వున్నట్టే కన్పించదే!

ఏ అలకా అల ఒక వాలు!

మరి లక్ష్యశుద్ధి యెక్కడ! లక్ష్యసిద్ధి యెక్కడ ?

మనందరి బ్రతుకులూ అంతే.

చెలియలికట్టని తాకాలని ముందు వెనకలకి గునుకులు తీసే అలలు.

క్షమించండి. మీ జీవితాలూ నా జీవితంలాంటివే ననుకుని మాట్లాడేస్తున్నాను.

ఏ జీవితానికైనా, యేంవుంది పరమార్థం?

మనలాంటి మరో జీవితాన్ని, మన మనసుల్నర్థం చేసుకుని మనతో ఏకం కాగల యింకో జీవితాన్ని.

మన జీవితంలో భాగంగా_

మన అంతఃప్రవాహంగా_

పొందగలిగితే, ఏ జీవితానికైనా ఇంకా కావాలసిందేం వుంటుంది గనక?

ఆ అదృష్టం అందనినాడు, ఎవరి బ్రదుకైనా యేటి పాలే. ఆ ఏటి కెదురీదినా అంతే; నిలువీత యీదినా అంతే! వాలున పడి కొట్టుకుపోయినా అంతే. అందులో— తర తరాల్నుంచి తల వంచి బ్రతుకుతూన్న ఆడ బ్రతుకు సంగతి చెప్పనవసరమే లేదు. అందరు స్త్రీల్లాగానే, నేనూ తల వంచే బ్రదుకుదామనుకున్నాను; ప్రేమ దేం వుందిలే అనుకున్నాను; ప్రేమ లేందే ప్రాణం నిలబడదేమిటి అని సరిపుచ్చుకున్నాను.

ప్రేమించకుండానే పెళ్ళి చేసుకున్నాను.

ప్రేమంటే ఏమిటో తెలిస్తేకద ప్రేమించి పెళ్లి చేసుకోగలిగేది.

ప్రేమంటే ఏమిటి?

శరీరాకర్షణ చూచి, క్షణిక కామేచ్ఛతో, అపేక్షతో, మన కనులు కప్పుకుని మన దేహదాహం తీర్చుకోవడమా?

శవాన్ని కప్పే గోరీలా, ఇంకో వ్యక్తి జీవితం చుట్టూ గోడలు కట్టి, చట్టాలతోనూ సంప్రదాయాలతోను సొంతం చేసుకుని, నాదేనని సంతోషిస్తూ కూర్చోవడమా?

తనువులూ మనసులూ ఏకమై తనువులున్నంతవరకూ తారతమ్యాలూ, నీ నా భేదాలు లేకుండా మనగలగడమా?

ఆర్ద్ర హృదయంతో అన్యుల్నర్థం చేసుకుని, మన జీవితాల్ని మరిచిపోయి, అన్య జీవితాల కంకితమైపోయి, పరోపకారార్థం మిదం శరీరమని మానవసేవలో మునిగిపోవడమా?

ఈ జీవితాన్నే గుర్తించకుండా, దైనందిన సంబంధాలన్నీ తెగతెంపులు చేసుకుని, ఆత్మ పరమాత్మల అనుబంధంతో చిదానందంలో తేలిపోవడమా?

ఇందులో ఏది ప్రేమ ?

నిర్ధారణ చేసేదెవరు?

ఎవరి ధారణ వారిది, ఎవరి నిర్ధారణ వారిది. ఏ ధారణా నిర్ధారణ లేకుండా బ్రదుకులు వెళ్ళబోసేవాళ్లెందరు లేరు?

నేనూ అలా బ్రదగ్గలిగితే ఎంత బావుండేది.

కాని—మన బ్రతుకులకి కర్తలం మనఁవొఁక్కళ్ళఁ వేనా? వంశ పారంపర్యంగా మనలో ప్రవహిస్తూ వొచ్చే నెత్తురు, మనం తాగిన తల్లి చనుబాలు, మనం పుట్టి పెరిగిన వాతావరణం, మనం కలుసుకునే మనుషులు, మన హృదయ తంత్రులు మీటి పలకరించి, పలికించగల ఆత్మీయులు...

ఈ జీవితానికిందరూ—కర్తలు.

ఈ మాసిన బ్రతుకుల మూసిన పుస్తకాలు తెరచే దెందరు? తెరచి, చదివేదెందరు?

చదివి, సానుభూతితో అర్థం చేసుకోగలవాళ్లెందరు ?

ఎవరి బ్రదుకులు వాళ్ళ కర్థఁవైఁతే, ఇతరుల బ్రదు కులు అర్థం జేసుకున్నంత ఫలం.

నే చెప్పే యీ మాటలన్నీ నన్ను నే నర్థంచేసుకోవా ల్ననే; కాని—ఎలా?

నన్ను నేను చదువుకునేదెలా ? నన్ను నే నర్థం చేసు కునేదెలా?

నా మాటల్లో ఏ మారుమూలనో నా వ్యక్తిత్వం దాగి వుంటుంది. ఆ వ్యక్తిత్వాన్ని వెలికిదీసి, మీకు నేను చూపిం చాలి; నాకు నన్ను చూపించుకోవాలి.

ఈ మాటలు నా జీవితంలోని ప్రేమలూ, బాధలూ, అందాలూ, ఆనందాలూ, ఆవేగాలూ, వుద్వేగాలూ ఆలో

చనలూ, సంఘటనలు మీకు కళ్ళకు కట్టేట్టు చూపించ గలవా?

ఏవో, మాటల దేవుంది? ఈ మాటలు సీస్మోగ్రాఫ్ లాంటివి. ఫలానా అప్పుడు ఫలానా చోట భూకంపం జరుగు తుందీ అని సూచిస్తుంది సీస్మోగ్రాఫ్. అంతే. ఆ భూకంపం వల్ల జరిగే బీభత్సవూ, ప్రాణ నష్టవూ అది వివరించదు.

ఆ వివరాలన్నీ వూహించుకోవలసింది మనం.

అంచేత _ మీరు వినవలసింది నా మాటలు కాదు; నా మాటల వెనక, నా మనసులో నిశ్వసించే చిమ్మచీకటిని చూడగలగాలి మీరు. ఆ సజీవాంధకారోచ్ఛ్వాస నిశ్వా సాల్ని వినగలగాలి.

ఆ మాటల ఉపరితలమేనని మాత్రం పొరబడకండి, నా భర్తా అలాగే పొరబడ్డారు.

ఔను నా భర్త.

నాకు తాళిగట్టిన భర్త. నన్ను పెళ్లి చేసుకున్న భర్త.

నేను మౌనంగా కూర్చునుంటే, నన్ను మాట్లాడించా లని విశ్వప్రయత్నం చేసేవారాయన. ప్రక్క-ప్రక్క-నే కూర్చు నున్నా, మా యిద్దరి మధ్యా ఏదో లోతులు తెలియని అగాధం.

ఆ అగాధంపైన మాటలతో వంతెన వెయ్యాలని ఆయన సంకల్పం.

---

ఆ వంతెనమీదుగా నా దగ్గరికి చేరాలని ప్రయత్నం. ఆ మాటలతో తన వునికిని నాకు తెలియజెయ్యాలని, మా సంబంధాన్ని—ఆ వైవాహిక బంధాన్ని—పటిష్టం చేసుకోవాలని, మా యిద్దరి మధ్యా ఉక్కుగోడలా నిలబడ్డ ఏకాంతానికి కంతలు పొడవాలని—

"ఆ ఆ ఏవిటి ఏమిటీ నువ్వంది!"—అనేవారు.

ఆ ఏవిటేవిటో నా కర్థమయ్యేది కాదు మొదట్లో.

అర్థంకాని హాస్యం విని, మర్యాద కని నవ్వుతారే, అలా నవ్వేదాన్ని. అది చూచి ఆయన సంతోషించేవారు. సంతోషమంటే అదొకరకం వింతసంతోషం. ఇంట్లోకి అడుగు పెట్టగానే, మా పెంపుడు కుక్క తోక వూపుకుంటూ ఎదురు వెళ్ళినప్పుడూ, సరిగ్గా అలాగే సంతోషించేవారాయన. అంటే—ఆ ముహంలో ఆ సంతోషానికీ యీ సంతోషానికీ భేదవేవిటో అర్థమయ్యేది కాదు నాకు.

భేదం ఏవీలేదని తెలిసొచ్చిం తర్వాత నవ్వడం మానేశాను. అది చూచి, ఆయన కోపం తెచ్చుకునేవారు.

"అదేవిటి సరళా? నిన్నే!"—అనేవారు.

అంతతో ఆగినా అదొక మహాబాగే.

"ఎంత లేదన్నా నీ భర్తన్నేను. నీకు తాళిగట్టానన్న మాట మరిచిపోబాక, మరీ"—అనేవారు.

ఆ సంగతి మరచిపోలేకనే, ఇంకా ఆయనకు భార్యగా నలుగురిలోనూ మెలగ్గలుగుతున్నానని ఎలా చెప్పను?

అందుకని — మాట్లాడేదాన్నిగాదు. మెదలకుండా అలాగే కూర్చునేదాన్ని.

అప్పుడు నాకు నా చిన్ననాటి స్నేహితుడు గుర్తుకొచ్చే వాడు...నాకు నిండా పన్నెండేళ్ళు కూడా లేనప్పుడు, అతనికి పధ్నాలుగో, పదిహేనో.

మా మేడమీద, దీపాలార్పేసి, వెన్నెట్లో కూర్చునే వాళ్ళం మేమిద్దరవూ. తన వీపు వెన్నెలవేపుకు పెట్టి నా ముహం వెన్నెలవైపుకు తిప్పి, అలాగే కదలకుండా మెదల కుండా, కన్నార్పకుండా చూస్తూ కూర్చునేవాడు నన్ను.

అలా...

ఒకళ్ళ కొకళ్ళ కెదురుగా...

ఎంతసేపు కూర్చునేవాళ్ళవో మౌనంగా...

ఎంత ఆనందంగా వుండేదని ఆ మౌనం—

మా యిద్దరి మధ్యా అంత దూరం వున్నా మాకు కని పించని దారాలేవో మమ్మల్నిద్దర్నీ విడదీయడానికి వీల్లేకుండా బంధించివేస్తున్నాయనిపించేది. మా యిద్దరి హృదయాలూ ఒకేసారి స్పందిస్తూన్నట్టుండేవి.

స్పర్శను మించిన సౌఖ్యం కలిగేది.

చూశారా ?

అదీ మౌనమే.

ఇదీ మౌనమే.

అది ఆనందం, ఇది బాధ.

అది సాన్నిహిత్యం, ఇది హితవు కాని బంధం!

అందుకే మీకు ముందే చెప్పాన్నేను ; మీరు నా మాటలు విని వూరుకోవద్దనీ, ఆ మాటల వెనక కనిపించే అనుభూతిని సానుభూతితో అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలనీని.

నిజానికి నేనీయన్ని పెళ్ళి చేసుకోవలసింది కాదు, చేసుకునేదాన్నీ కాదు.

నాలా, పెళ్ళయింతర్వాత, భర్తల నిజస్వరూపం తెలుసుకున్న స్త్రీలంతా అలాగే అనుకుంటారేమో; అనుకుని చేతులు కాలిం తర్వాత ఆకులు పట్టుకుని ప్రయోజనం ఏం వుందిలే అని వూరుకుంటారేమో, నేనలా ఊరుకోలేను.

నా చేతులు కాల్చుకున్నది నేను. ఎవర్ని పెళ్లి చేసుకుంటే ఏం వుందిలే అని వూరుకున్నది నేను. ఉరిపెట్టుకు చావలేక తాళి కట్టించుకున్నది నేను.

ఏంజెయ్యను? నా బాల్య స్నేహితుడు నా కనుమరుగై పొయ్యాడు. నన్నొంటరిదాన్ని చేసి వెళ్లిపోయాడు.

ఈ లోకమే వదిలెళ్లిపోయాడు. నే నీ లోకాన్ని వద లేకపోయాను. నా పేరు మారలేదు; నా రూపు మారలేదు. కాని నాలో ఏదో వెలితి కనిపించింది. అప్పుడు చాలా చిన్న దాన్ని నేను. యుక్త వయసొచ్చినా, వ్యక్తత తెలియని రోజులవి. అందుకనే, ఈయన వచ్చి—

"మనం పెళ్లి చేసుకుందాం. పెళ్లి చేసుకుం తర్వాత దానంతటదే పుట్టుకొస్తుంది ప్రేమ..." అంటే, నే నెదురు ప్రశ్న వెయ్యలేదు.

"పెళ్లికి ప్రేమకాదు ముఖ్యం, స్నేహం కావాలి, స్నేహం కలగాలి. స్నేహం వుండి మనసు మంచిదైతే చాలు, ఇంకేవీ అక్కర్లేదు"—అన్నారీయన.

అప్పటికీ ఇప్పటికీ నాకంటే పదిహేనేళ్ళు పెద్ద ఈయన. ఇప్పుడు నా వయసెంతో, మా పెళ్ళయినప్పుడు ఆయన వయసంత.

నాకంటే పెద్దవాడు. ఎక్కువ జీవితానుభవం వున్న వాడు. గొప్ప జీతం తెచ్చుకుంటున్నవాడు, మంచిహోదాలో వున్నవాడు, పెద్ద ఆఫీసులో పదివందలమందిమీద పెత్తనం చెలాయిస్తున్నవాడు.

నువ్వదృష్టవంతురాలివే_అన్నారు తోటివాళ్ళు, అసూయగా, కన్నెర్రగా.

నేనా ఎరకు ఎరక్క పడిపోయాను. ఔను మరి, కల

కాలం కాలుమీద కాలేచుకు్కుని తిన్నా కదలని సంపాదన.

చక్కని హోదా.

గొప్ప గౌరవం.

నేను పుట్టి పెరిగిన వాతావరణం హోదా నెరగనిది; గౌరవంలో వున్న గొప్ప తెలియనిది.

అన్నట్టు...ఇంతవరకూ మీకు — చెప్పలేదు గదూ?

మా అమ్మ ఒక వేశ్య. తన బిడ్డ తనలా కాగూడదని కలలుగన్న తల్లి.

తన వాతావరణమే నాకు సోకకుండా చెయ్యాలని, పట్టుదలతో ఎక్కడో దూరాన, స్కూల్లో చదువు చెప్పించింది.

ఐనా, పదే పదే నా పుట్టుక న్నాకు గుర్తుచేసి, నా గుట్టు బయటపెట్టి నలుగురిలోనూ నన్ను చులకన చేసింది యీ లోకం. ఆలోకాన్ని చూచి భయపడీ, ఆ లోకం నెత్తిమీద తిష్ఠ వేసుకు్కూర్చోవాలన్న పట్టుదల పెరిగింది నాలో.

ఆ తల్లి రక్తం కాదూ నాలోమాత్రం ప్రవహించేది.

నా హృదయంలో వెలితిని, ఈ కలిమితోనూ, గౌరవంతోనూ, హోదాతోనూ నింపుదామనుకున్నాను. గతం మరచిపోయి మంచిగా వుందామనుకున్నాను. అన్నీ తెలిసీ

నన్ను స్వీకరించేందుకు సిద్ధమైన భర్త విశాల హృదయం చూచి విస్తుపోయాను.

పెళ్ళి చేసుకున్నాను.

ఆయనకు తగిన భార్యగా బ్రతుకుదామనుకున్నాను. నిండుకుండలా వుందామనుకున్నాను. ఉండగలనని ధైర్యం చెప్పుకున్నాను. పెళ్ళయిన కొత్తలో అలాగే వున్నాను. ఉన్నానని అనుకున్నాను. నన్ను నేను నమ్మించుకున్నాను.

కాని,

మనల్ని మనం ఎంతకాలమని మోసం చేసుకోగలం.

అదేం విచిత్రమో పెళ్ళయిన వారం రోజులకే మా యిద్దరి మధ్యా వున్న తెరలు తొలగిపోవడం మాటటుంచి, ఎక్కువౌతున్నాయనిపించింది. సందేహాల పొరలు తెరలు తెరలుగా లోనుంచి తెరలుతున్నాయనిపించింది. మనసు వికసించడానికి బదులు ముకుళించుకుపోతూన్న దనిపించింది. అమృతధారలకోసం తహతహలాడే హృదయం, అలాగే తీరని దాహంతో ఎండి బీటలువారిపోతూం దనిపించింది. సముద్రాన్ని జేరాలని వురుకులెత్తే సెలయేరు ఏరుగా మారకముందే ఏ కొండ మలుపులోనో ఇంకిపోతోం దనిపించింది.

ఐనా, ఇంత బాగా కనుపించిన సత్యాన్ని గుర్తించలేక పోయాను. అందుకు కారణం నా భ్రాపమేమోననుకున్నాను.

అందాన్నెలా పోషించుకోవాలో మా స్కూల్లో నాకు నేర్ప లేదు. అద్దం ముందు నిలబడి అందాన్ని కొలుచుకోవాలనే చెప్పారు తప్ప, ప్రేమించిన మనిషి కన్నుల్లో ఆకర్షణ అసలు బరువును అంచనా వేసుకోవాలని నేర్పనేలేదు.

నేనందమైనదాన్నని, నాలో ఆకర్షణ వున్నదని కాని నా భర్త నా కెప్పుడూ చెప్పిన పాపానా పోలేదు; నేనను కున్నట్టు చెయ్యనూ లేదు.

తల్లిలా, తనని బుజ్జగించమనేవారు; పసిపిల్లాడిలా తనని పొదువుకోమనేవారు. అదీ మా ఏకాంత జీవితం.

కొత్తలో నాకది కొంత సాంత్వనగానే వుండేది; సంతృప్తిగానే వుండేది. కాని, పోను పోను విసుగుపుట్టేది; చిరాకేసేది; కోపం వొచ్చేది. నా శరీరం నా మాట వినేది కాదు.

సెగలు కక్కేది.

పొగలు చిమ్మేది.

ఆ సెగలకు నా వళ్ళు భగ్గుమని మండేది. అందని ఆర్ద్రతకోసం అర్రులు చాచేది. తీరని దాహంతో తహతహ లాడిపోయేది.

ఆ పొగల వగలు నా మనసు నుక్కిరిబిక్కిరి చేసేవి.

నా కళ్ళ నీళ్ళు తిరిగేవి.

నా మంచి మనసింత అదుపు తప్పిపోతూందేవని నివ్వెర

పోయేదాన్ని. శరీరమ్మీద అధికారం చెలాయించవలసిన మనసే ఇలా ఆ శరీరం ధాటికి ఆగలేక లొంగిపోతుందేవని ఆశ్చర్యపొయ్యేదాన్ని.

మనసు మంచిదైతే చాలని చెప్పిన నా భర్త, నా మనసైై నిలబడవలసిన భర్త, చొరవ తీసుకొని తిరగబడి అదమాయించడేవా అని విస్తుపోయేదాన్ని.

ప్రక్కకు తిరిగి చూస్తే యీయన గుర్రుమని గురకలు కొడుతూండేవారు.

ఐతే—

అదంతా వొట్టిదేనన్నమాట.

వేదాంతమంతా వృధా దంతవాదనేనన్నమాట. శరీరం వేరు. మనసు వేరు కాదన్నమాట. శరీరం బరితెగిన పశువుల మందా, మనసు పశువుల కాపరీ కాదన్నమాట. శరీరం తుచ్ఛవూ మనసు ఉచ్ఛవూ కాదన్నమాట.

అవి రెండూ ఒకటే!

వాటి రెంటికీ విడదీయరాని బంధవేదో వుంది. అవినాభావ సంబంధవేదో వుంది. అన్యోన్య బాధ్యతలేవో వున్నై. దాసూ, ప్రభువూ అన్న తేడా లేదు, ఒకరికొకరు దాసులు; ఒకరికొకరు ప్రభువులు.

అదీ ప్రకృతి పురుషుల ధర్మం; దాంపత్య ధర్మవూ అదే.

ఐతే—

శరీరానిది పశు ప్రవృత్తి కాదు. శరీర ధర్మం అలసట తెలియని అశాంతి కాదు; అలసట నెరగని విశ్రాంతి.

సృష్టికి ఆదీ అనాది అదే; కన్నతల్లికి బాసటగా నిల చేదీ యీ కరదీపికే.

ఈ కరదీపిక నారిపోనీగూడదు.

ఇలా, నా వూహాలోక కొలికికి రాకముందే, పరిణతి చెందక ముందే—

నా కడుపు పండింది.

ఈ శుభవార్త నా భర్త చెవిని వేస్తే సంతోషిస్తాడను కున్నాను; కాని, ఆయన నిప్పులు తొక్కిన కోతైపోయాడు.

"బుద్ధుందా, లేదా నీకు ? కడుపొచ్చిందని చెప్పొ చ్చావా?" అంటూ ఎగిరిపడ్డాడు.

నాకేమీ పాలుపోలేదు.

కాదండీ, యిది మీ బిడ్డేనండీ — అని కాళ్ళావేళ్లా బడ్డాను.

"నా బిడ్డయితే, డొక్కలో ఒక్క తన్ను తన్ని చంపే స్తాను. చంపి నడివీధిలో పారేస్తాను"—అంటూ ఎగిరి తన్న బొయ్యాడు.

ఇంకా పూర్తిగా రూపమే ఏర్పడని పసికందంటే అంత

కసి దేనికో అర్థంకాలేదు నాకు. నా తల్లి మనసు తల్లడిల్లి పోయింది.

నా బిడ్డ నా కడుపులోనే మరణించింది.

మర్నాడు—

హాస్పిటల్‌లో ఆపరేషన్.

నా భర్త పరుగెత్తుకొచ్చాడు. నా ప్రాణానికి తన ప్రాణం అడ్డువేస్తానన్నాడు. డాక్టర్లు కావాలనగానే, తానే స్వయంగా, సంతోషంగా రక్తదానం చేశాడు. నేను లేందే తాను బ్రతకలేనని అందరికీ చెప్పాడు.

అందరూ నన్ను అభినందించారు.

"ఇంత మంచి భర్త ఎందరికి దొరుకుతాడు—" అని ముక్కుమీద వేలేసుకున్నారు.

"ఏనాడో పెట్టిపుట్టావు. నోచిన నోములూరికే పోవు; అదృష్టవంతురాలివి—" అన్నారు.

హాస్పిటల్నుంచింటికొచ్చిం తర్వాత, నా ప్రక్కన కూర్చుని నన్నోదార్చబోయాడు నా భర్త.

"అంతా బాగానే వుంది కాని, ఇదొక మాయనిమచ్చై పోతుంది సరు" అన్నాడు.

పశ్చాత్తాపడుతున్నాడేమో ననుకున్నాన్నేను. తర్వాతాయన మాట్లాడకుండా వుంటే యీనాటికీ ఆ భ్రమతోనే బ్రతికేద్దాన్నేమో—

కాని-ఆయన అంతటితో ఆగలేదు.

"ఆ ఆపరేషన్ మచ్చపోదు సరళా. చూడ్డానికెంత అసహ్యంగా తయారౌతుందనీ అది? మగవాడికి కలగబోయే కోరికని గూడా తుంచిపారేస్తుంది" అన్నాడు, ఏదో పుస్తకం చదువుతూన్నట్టు.

ఔను—అదీ మొదలు.

ఆనాటినుంచి ఎందుకనో గాని, ఆయన దగ్గరకు వస్తే చాలు బిర్రబిగుసుకుపోతుంది నా శరీరం. చైతన్యంలేని జడ పదార్థమైపోతుంది.

కాదు. ఇలా కాగూడదు. నాకాయన భర్త. నేనాయన భార్యని—అని పదే పదే నన్ను నేనే హెచ్చరించుకునేదాన్ని.

ఊహు! నా శరీరం నా మాట వినడం మానేసింది. నా మనసు మా దాంపత్య ధర్మాన్ని వదిలేసింది.

అక్కడికీ వేశ్యలా మనసులేని శరీరాన్ని, చలనంలేని కట్టెను ఆయన కర్పిస్తూనే వొచ్చాను. ఆనందిస్తున్నట్టు నటిస్తూనూ వొచ్చాను. ఆయనగారి కోరికలు తీరుతూనూ వుండేవి.

కోరికలు తీరినా, కనబడ్డవారికల్లా నన్నుగురించి చెబుతూనే వుండేవారాయన.

నేనొట్టి జడపదార్థన్నట!

నేను సహజమైన స్త్రీని కానేకానట.

అలా నలుగురికీ నన్ను దూరం చేసి, నా బ్రతుకు చుట్టూ కిటికీలు లేని ఒంటి స్తంభం మేడ కట్టి, నా జీవితం చీకటిమయం చేసి, నన్ను కలకాలం తనదానిగానే వుంచుకొని తృప్తిపడాలనేమో ఆయన కోరిక? ఎవరికి తెలుసు?

ఆయనగారి ప్రవర్తన చూస్తూంటేనూ, ఆ మాటలు వింటుంటేనూ, విసుగెత్తిపోయేది నాకు. నేపాల్ దేశం నెవారీ జాతి గుర్తుకొచ్చేది. ఆ జాతి స్త్రీలు చనిపోయేవరకూ సధవలేనట. ఎనిమిదేళ్ళు నిండక ముందే వాళ్ళనొక చెట్టుకిచ్చి పెళ్లి చేస్తారు. అసలైన పెళ్ళి అదే. ఆ చెట్టు చనిపోకుండా వుండేందుకు కొట్టి నదిలో పారేస్తారట. తర్వాతా స్త్రీ కెన్ని మనువులైనా, అవన్నీ వుత్తుత్తి పెళ్లిళ్ళకిందే లెఖ్ఖ.

ఎంత చక్కని సంప్రదాయం - అనిపించేది నాకు.

ఆ మాటే, ఒకసారి నా భర్త కోరికలు తీర్చుకునేందుకు దగ్గరకు రాగానే అనేశాను.

"ఎంత అన్యాయమ్మాట లంటున్నావ్, సరూ" అన్నారు.

"ఇక అనను లే"-అన్నాను.

కాని అనకుండా వుండలేకపోయాను. మళ్ళీ ఆమాటలే అన్నారాయన, "ఎంత అన్యాయమ్మాట లంటున్నావ్ సరళా..."అని.

ఈసారి, ఎందుకనో గాని, అననని నేను అనలేదు.

తర్వాత—

నన్ను పలకరించాలని, ఏకాంతంగా ఎంతో ప్రయత్నించావారాయన. ఐనా, కన్నెత్తి ఆమనిషిని చూడబుద్ధేసేదే కాదు. నోరెత్తి మాట్లాడాలనిపించేదీ కాదు.

నేనేమీ అనకుండానే—

"ఆ, ఆ, ఏవిటదీ? ఏమిటి నువ్వంది?..."అనడిగేవారు.

అంతకు పూర్వం ఏవన్నాను గనక, తర్వాత మాత్రం అంటాను?

అందుకని—నవ్వేసేదాన్ని. తర్వాతర్వాత ఆ నవ్వూ మానేశానని చెప్పాకదూ?

ఇకిలా పప్పులుడకవనుకున్నారో, ఏమో, నలుగురూ వుండగా కవ్వించి నన్ను నవ్వించాలని చూసేవారు.

నా కలాంటప్పుడల్లా మాపెళ్లి జరిగిన కొత్తలో జరిగిన సంఘటనొకటి జ్ఞాపకం వొచ్చేది.

ఒకనాడు, నేను నాకు బాగా నచ్చిన చీరె కట్టుకొని, చక్కగా ముస్తాబై, సరాసరి హాల్లోకెళ్ళిపోయి, మావారి మెడచుట్టూ చేతులేసి, "ఎలా వున్నానండీ?..." అనడిగాను.

ఆయన నా చేతులు గొంగళిపురుగుల్ని నులివేసినట్టు దురివేసి...

"నీకేమైనా మతి పోయిందా, సరళా? సంగతీ సంద

ర్భమూ చూడఖ్ఖర్లా? వెళ్ళు లోపలికెళ్లు..." అని గదమా యించారు.

ఏమిటా ఇట్లా అంటారని చుట్టూ చూచాను. ఎవరో నలుగురు కూర్చునున్నారు. ఆదరాబాదరా లోపలికెళ్లి పోయాను.

తర్వాత నా గదిలోకొచ్చి, "సరూ, ఆ దేవుడి పుణ్యమా అని నీ తల తియ్యడానికి వీల్లేకుండా ఆ మెడ మీదలా వుంచాడు గాని, లేకపోతే నువ్వు నీ తలని గూడా ఎక్కడో పెట్టి మరిచిపోయుందువు" అన్నారాయన పగలబడి నవ్వుతూ.

కాని దేవుడి పుణ్యమా అంటూ నేను నా తలనీ, నా తలలోని ఆలోచనల్ని మరచిపోలేదు.

అందుకనే మా ఇద్దరి మధ్యా యీ తాప కోపాల బంతులాట ప్రారంభమైంది.

ఉన్నకొద్దీ ఆయనగారి కోపం హద్దులు మీరింది. పట్ట పగలు గబ్బిలం పదే పదే గోడని ఢీకొన్నట్టు నన్ను ఢీకొనడం మొదలెట్టారు.

చివరికి నా బ్రతుకిలా, శిథిలాలయం గోడలా, తయా రైంది.

చాలమంది నన్నే తప్పుపట్టారు. నేను నివురుగప్పిన నిప్పునన్నారు. తాళికట్టిన భర్తకు ఎదురు తిరిగిన భార్య నన్నారు. ఆదర్శ గృహిణిని కాదన్నారు. "ఎక్కడికి పోతుందీ

ఆ తల్లి బుద్ధి! ఆ తానులో ముక్కకాదూ యిది!"అని యీాస డించారు. ఏటికెదురీదే మనిషినన్నారు. తర తరాల సంప్రదాయాల్నీ కట్టుబాట్లనీ లెక్కచెయ్యని స్త్రీ నన్నారు.

ఏం చెయ్యన్నేను ?

ఏం చెయ్యగలను !

"రా సరూ ప్రొద్దుపోయింది!" అనంటూరాయన.

వెళ్దాం మా అని వూగుతాను. ఈ ఎదురీత మాని వాలున పడిపోదాం మనుకుంటాను.

ఇంతలో మళ్లీ—

"ఎంత లేదన్నా నేను నీ భర్తని సరళా. నీకు తాళి గట్టినవాణ్ణి. నేను రమ్మనగానే రావాలి నువ్వు—" అంటా రాయన.

ఆ మాటలు వింటే, ఇక నాకాళ్ళు కదలవు. నేను వెళ్ళలేను. నేలకు పాతుకుపోతాను. శిలాప్రతిమలా నిలబడి పోతాను.

ఐనా నాకు తాళిగట్టిన భర్తలో మార్పురాదు. ఈ భూమి బ్రద్దలు కాదు. ఆ ఆకాశం నేలకు కూలదు.

ఔను......సామాన్య మానవ జీవితాల కంత శక్తి యొక్కడిదీ?

ఏమో...అంతేనేమో...నా బ్రదుకిలా చెట్టుమీది పువ్వులా ఏ అందాల శిరోజాల్నీ అలంకరించకుండానే ఏ దేవుడి పాదాలూ పూజించకుండానే వాడి, ఎండి రేకులు రాలి నేలపాలు కావలసిందేనేమో.

అడవిలో ఎన్ని పూవులు పూయలేదు? ఎన్ని వెన్నెలలు కాయలేదు??

— /o/ —